# శివుని ఆజ్ఞ

పెళ్ళయి మూడేళ్ళయింది.

రాజాకి యేడాది వెళ్ళి నాలుగో నెల.

ఇంతవరకు హానీమూన్ కాదు కదా అనకాపల్లికూడ వెళ్ళలేదు. విశాఖ పట్నం నుంచి కదిలి చాలా రోజులయింది.

ఎక్కడికైనా దూరప్రయాణం వెళ్ళి ఓ పదిరోజులు గడిపిరావాలని ఎంతో కోరిక. దేవికి మరీను. ఎన్నో చూడాలనీ- ఇంకెన్నో కొత్త విషయాలు తెల్సుకోవాలనీ

తను మద్రాసు ఆఫీసు పనిమీద వెళ్ళి వచ్చాక అక్కడి సంగతులన్నీ చెప్పి చక్కని తిండికోసం తనెంత మొఖం వాచి పోయాడో చెబితే "నన్నుకూడా తీసుకుపోతే మీకా యిబ్బంది వుండేది కాదుకదా-- నాకూ కోరిక తీరేది" అంది నిజమే తనకీ తీసుకు వెళ్ళాలనే వుండేది. కానీ యేమిటో పరిస్థితులలా అడ్డు తగిలాయి.

ఈ సారి యేదో తెగించాడు.

ఎలాగూ ఈ యేడు బోనసు ఎక్కువ వస్తుంది. ఎప్పుడూ వున్న ఖర్చే ఎన్నికొన్నా యింకా ఏదో లోటు వుండనే వుంటుంది.

యేమైనా సరే ఈసారి ఆ డబ్బుతో తిరుపతి, అట్నుంచటు మద్రాసు

వెళ్లాలి— చిన్నప్పుడు యెప్పుడో చూసిందట దేవి— తన నిర్ణయాన్ని బలపరచింది ఏ మాత్రిం బలపరచక పోయినా ఆ డబ్బంతా మళ్ళీ సంసార గుండంలో పడిపోయేదే—

ఎంత ఖర్చయినా సరే ప్రయాణం సుఖంగా జరగాలనేది మొదట అనుకున్న విషయం. అందుకే అన్నిటికి రిజర్వేషన్లు బుక్ చేయడం జరిగింది.

మద్రాసు పోవు ఎక్స్‌ప్రెస్ మరికొద్ది నిముషములలో బయిలు దేరనున్నది అరిగిపోయిన గ్రామఫోను రికార్డులలో ఎనౌన్స్‌మెంటు చెవిలోపడింది

స్టేషనంతా పెళ్ళి వారిల్లులా జనసమూహంతో కిటకిటలాడి పోతుంది

కూతవేసి రైలు కదిలింది.

తుళ్ళిపడ్డ రాజుగాడిని ఒడిలో చేర్చుకుని కిటికీ ప్రక్క కూర్చుని బైటకు చూడ్డం మొదలుపెట్టింది దేవి గాలికిముంగురులు ఎగిరిపడుతున్నాయి ఎన్నాళ్ళ తర్వాతో ప్రయాణం. ఆమె ముఖంలో సంతృప్తి రేఖలు తాండవిస్తున్నాయి. వచ్చే ఈదురు గాలికి రాజాగాడి కళ్ళు మూతలుపడుతున్నాయి.

పొలిమేరలు దాటి పరుగులు పెడుతోంది రైలు. సాయంకాలపు నీరెండతో ప్రికృతంతా కొత్త అందాన్ని సంతరించుకుంది.

"అన్నట్టు—పిల్లిని బయటకు తరిమి తలుపువేశారు గదూ?" దేవి ప్రశ్నకు శాంతంగా ప్రికృతిని చూస్తూ మైమరచిన తను గతుక్కుమన్నాడు.

తనుపిల్లిని బయటకు తరిమినట్టు గుర్తులేదు—భోంచేసి వచ్చి నేలమీద నడుం వాలుస్తూ చూశాడు యింట్లో పందిరి మంచంకింది పట్టిమంచం మీది పిల్లిని

సుఖ నిద్రిలో వుంది పిల్లి

"వెళ్ళేటప్పుడు దీన్ని బయటకుతరిమి మరీ వెళ్లాలి జ్ఞాపకముంచుకు

చెప్పు." అన్నాడు అప్పుడే దేవితో!

దేవి మర్చిపోయినట్లుంది!

"ఇప్పుడా చెప్పటం. ఆ తెలివి ముందే యేమైంది నాకు మతిమరుపని గదా నీకు చెప్పింది'' దేవి మీద కోపం ముంచుకొచ్చింది.

,,బాగుంది మధ్య నేనా దొరికాను. సామానుతో ముందు నన్ను వెళ్ళమని తర్వాత మీరేగా తలుపు వేసుకొచ్చారూ"

భార్య సమాధానం నచ్చలేదు.

యేమైతేనేం తను పిల్లిని బైటకు తరమలేదు. కొండంత నవతాళ్ మాత్రం గుమ్మానికి తగిలించి ప్రక్కింటి వాళ్ళతో యింటిని భద్రంగా చూడమని మరీ వచ్చాడు.

వెధవ పిల్లి యింట్లో వుండిపోతే ఛస్తుంది

ఒకటా రెండా పదిరోజుల కేంపు— దానికి గాలి తప్ప జీవించడానికి మరేదీ దొరకదు.

బెడ్‌రూంకి సంబంధించిన తలుపులన్నీ తనే వేశాడు. అప్పుడన్నా గుర్తు రాలేదు

,,దానికి పెరుగన్నం పెట్టి పాలుపోసి చేరదీసింది నువ్వు— ఇప్పుడు చూడూ చేతులారా చంపినట్లవుతుంది'' భార్య నుద్దేశించి అన్నాడు.

,,బావుంది నేనేం చేరదీశాను- అదే కిందపడ్డ మెతుకులు యేరుకు తినేది డొక్కలెండి ఆకలితో మాడిపోయినా దానికి పట్టెడు మెతుకులు దొరికింది లేదు. అయినా ఈ మాత్రం దానికే ఛస్తుందా— కాకపోతే డొక్కలు మాడి చిక్కి సగ మౌతుంది'

భార్య మాటలకు కొంత ధైర్యమొచ్చింది. కానీ యేది యేమైనా తెలిసో తెలియకో దాని ప్రాణానికి తనుకష్టాన్ని కలిగించిన వాడౌతాడు.

అసలా పిల్లి తన యింటికొచ్చి రెండు నెలలవలేదు. ఎదురింటి పెద్ద పిల్లి ఈని ఒక పిల్లని తమ యింట్లో వదలి వెళ్ళింది దాన్ని వదలించుకోడం కోసం చాలపాట్లు పడాల్సి వచ్చింది. కానీ సాధ్యం కాలేదు. ఎంత దూరం తీసుకెళ్ళి వదిలినా తిన్నగా మళ్ళీ వచ్చేది

"పిల్లి కూనే గదండీ పోనీ వుండనివ్వండి" అంది దేవి

"ఛట్. అదేం కుదర్దు—పొద్దున్న లేచిందగ్గర్నుంచి దీన్ని చూసుకోవడంతోటే సరిపోతోంది." అన్నాడు తను— కానీ ఎంత విసిరి కొట్టినా దానికీ కదల బుద్ధి కాలేదులావుంది మొండికేసి వుండిపోయింది.

రోజులు గడుస్తున్న కొద్దీ రాజాగాడికని పెట్టిన పాలు తాగేయటం తింటున్న కంచంలో మూతి పెట్టడం, అలమరలోని పెరుగు, గాజు సామానులు తిరగతోయడం అది చేసేపనికి అంతూ పొంతూ లేకపోయింది.

"మచ్చిక చేస్తే బాగానే వుంటుంది" అంది దేవి చివరికి

మౌనం వహించక తప్పలేదు-

ఆ తర్వాత ఇది తిండికి వేరేకంచం

రాజాగాడి కాళ్ళమధ్య చేరి ఆటల్ను

దాని అల్లరికి హద్దేలేదు.

యేడిచే రాజాగాడు కూడా పిల్ల కంటపడితే చాలు దాంతో పరుగెడుతూ ఆటలు మొదలు పెట్టేవాడు.

అటువంటి పిల్లిని గూర్చి ప్రయాణమయేటప్పుడు కూడా ఎవరూ

పట్టించుకోలేదు.

దేవి మాత్రం అంది—"ఈ వెధవముండకి ఈ వారం రోజుల పస్తై మన మొచ్చేసరిక్కి నక్కలా తయారౌతుంది."

ఆ మాటలకు తనే అడ్డుతగిలాడు.

"దానికి మన ఒక్క యిల్లేఖర్మ—ఎక్కడపడితే అక్కడే అది బతుకుతుంది నక్కలా కాదు, మనమొచ్చేసరికి దుక్కలాగే వుంటుంది" అన్నాడు తను.

దేవిది మాత్రం జాలిగుండె. యే విషయాన్నీ అంత తేలిగ్గా తీసిపారే యలేదు.

"స్వతంత్రంగా బతక్కుండా ఒకరి దయాధర్మ భిక్షకోసం బతికేటటు వంటి నోరులేని జంతువులను పుట్టించడం ఆ దేముడిదే తప్పు" అంటుంది.

"ఈ ఇంట్లో ఎలకలు లేవుగానీ స్వతంత్రంగా తన ఆహారం సంపా దించుకునేదే" అన్నాడుకూడా తను.

ఏమైనా పిల్లి అల్పప్రాణి—ఎందులోనో చదివాడు తను. గుర్తులేదు పిల్లి పది సంవత్సరాలు బతుకుతుందని. ఇది పుట్టి సంవత్సరం కాలేదు. ఇంకా ఎలుక మాంసం రుచి ఎరుగదు.

అటువంటిది ఒకవేళ చచ్చిపోతే—

రైలు యేదో స్టేషన్‌లో ఆగింది. ఎక్కేజనం, దిగేజనం, రిజర్వుడు కంపార్టుమెంటు కాబట్టి తమ పెట్టెలో కెవరూ ఎక్కలేదు.

మూడవ తరగతి ప్రయాణీకుల పెట్టె తల్చుకుంటేనే భయమేసింది ఎప్పుడో చిన్నప్పుడు స్టూడెంటు కన్‌సిషనేతో గుంటూరు వరకూ వెళ్ళాడు. ఆ

అనుభవించాలు జీవితాంతంవరకూ నిల్చిపోవడానికి.

మర్నాడు తెల్లారి పదిగంటలకు బండి గూడూరు చేరటం. దిగినవెంటనే తిరుమల బస్సు దొరకటం, కొండమీద దిగిన వెంటనే రిజర్వుచేసిన కాటేజీ దొరకటం, అన్నీ శ్రమలేకుండా జరిగిపోయాయి.

ఎక్కడబడితే అక్కడ యత్రికుల నుంచి డబ్బు దోకుకుని దోపిడీలు చేసే జనం.

బస్సుల దగ్గర, కాటేజీల దగ్గర కళ్యాణకట్ట దగ్గిరా చివరకు ప్రసాదం దగ్గరకూడా మోసం మోసం—దేముడి ఎదుటకూడా మోసం—విసుక్కున్నాడు తను.

ధర్మదర్శనపు క్యూలో నాలుగ్గంటలు కూర్చున్నసమయంలో ఓ దృశ్యం కంటపడి మనసు కలుక్కుమంది. ఎదురింటి పాతగోడమీది పిల్లిని కోతులన్నీ కలసి తరమసాగాయి.

ఈ పాటికి ఆ చీకటి గదిలో తిండి లేక అటూ ఇటూ తిరిగే ఆ పిల్లి యెంత నరకవేదన అనుభవిస్తోందో—ఆ గదిలోంచి అరుపుకూడ బైటికి విన్పించే ఆస్కారంలేదు. విన్పించినా ఎవరు మాత్రం ఏం చేయగలరు?

"పోనీ పక్కింటివారికి ఉత్తరంరాస్తే" అన్న ఆలోచనకూడా వచ్చింది రాసినా తనువేసింది మామూలు తాళంకాదు.

ఇంతకీ ఆ పిల్లికి తమ పడకగదిలో చచ్చిపోయేటట్లు రాసివుంది కాబోలు

పురోహితుడిని సంప్రదించి శాంతులేమన్నా చేయించాలేమో కనుక్కోవాలి—స్వంత యిల్లుకాదు. అంతమట్టుకునయిం. కావలిస్తే యిల్లుకూడా మార్చేయవచ్చు.

ఈ వెధవ పిల్లివల్ల ఎన్నిపాట్లుపాడాలో !

చిన్నప్పుడు తనుండే యింట్లో పిల్లి వుండేది. అది పెంపుడు పిల్లి. తను దానితో ఆడుకునేవాడు. ముద్దుగా దాని మెడ పట్టుకొని కౌగిలించుకునేవాడు.

"దాన్నలా నలిపేయకురా బాబూ—నీ చేతుల్లో చచ్చిందంటే మహా పాపమంటుకుంటుంది. దాని శరీరంమీద ఎన్ని రోమాలున్నాయో అన్ని గుడులు కట్టించినా పోదా పాపం" అనేది నాయనమ్మ. తనకింకాగుర్తే.

క్యూ ముందుకు కదిలింది.

అంతా గోవిందలు కొట్టారు.

"స్వామీ తెలియక చేసిన ఈ పాపానికి క్షమించు తండ్రీ..." అంటూ వెంకటేశుడిని మనసులోనే మొక్కుకున్నాడు

దర్శనం చేసుకుని బైటపటి భోజనాలు కానిచ్చాక "పాపనాశనం" వెళ్దామనేసరికి ఆశ్చర్యంగా చూసింది దేవి.

దేవి వెళ్దామంటే వద్దన్నది తను మళ్ళీ ఇప్పుడు ఇలామారింది.

నిత్యజీవితంలో చేసిన పాపాలన్నీ కడుక్కుపోవటానికి పాపనాశనం దగ్గర స్నానం చెయ్యాలి అంటారంతా. జీవితంలో ఎరిగుండగా తనేపాపమూ చేసినట్లు గుర్తులేదు పైగా నమ్మకం అంతకంటేలేదు పాపాలకు ప్రాయశ్చిత్తం అనుభవించకుండానే ప్రజలు తండోపతండాలుగా వచ్చి పాపాలు కడిగేసుకుంటూంటే పాపభీతి యింకెక్కడుంటుంది. మనుషుల్లో—

ఏమైనా తను వెళ్ళదల్చుకోలేదు.

అందుకే దేవి మాటను కాదన్నాడు. అక్కడ చూసేందుకేమీ లేదన్నాడు

కానీ యిప్పుడు—

తెలిసి చేసినా తెలియకచేసినా తనకా పాపం చుట్టుకుంటుంది.

పిల్లి బ్రహ్మహత్య!!

దాన్ని వదిలించుకోవాలంటే వేరే మార్గంలేదు

ఆ మర్నాడు దిగువ తిరుపతి. మంగాపురం, కాళహస్తి వరసగా అన్ని దేముళ్ళదగ్గిరా ఒకటే కోరిక

ఎక్కడికెళ్ళినా ఏదో సందర్భంలో యింట్లో వదిలిన పిల్లే జ్ఞాపకమొచ్చేది

మద్రాస్ మెరీనాబీచ్‌లో, అడయార్ మర్రిచెట్టుదగ్గిరా, షేరిన్‌కార్నర్ మహాబలిపురం శిల్పసంపదల మధ్య—

ఆ చూసిన జ్ఞాపకాలకంటే—

ఆ అనుభవించిన ఆనందంకంటె—

ఎక్కువగా. ఉధృతంగా—

మనసులో——హృదయాంతరాళాలలో—

కలుక్కుమనే—

పాపభీతి—

పిల్లి చావు—

కదలక, కదలక వెళ్ళటం యిష్టంలేనట్టు మెల్లగా, మందంగా ఎలాగో పదిరోజులూ గడిచాయి.

వాల్తేరులో దిగేసరికి కుంభవృష్టిగా వర్షం. మనిషి మనిషికీ అడ్డుగోడలా వర్షధార.

ఎప్పుడూ రూపాయికి వచ్చే రిక్షావాడు రెండున్నరకు తగ్గనన్నాడు.

డ్రైనేజ్ కోసం తవ్వి వదిలేసిన రోడ్లు ఎత్తుపల్లాలతో గతుకులతో ఎప్పుడూ బాగుపడకుండా స్ప్రింగ్ రోడ్లని పేరుపడ్డదార్లు ప్రవాహంతో నిండిపోయాయి

రిక్షాలోంచి గుమ్మంలోకి అడుగుపెట్టే సరికే బట్టలు సగం తడిశాయి. తాళం తీస్తుంటే గుర్తుకొచ్చింది.

చలికి వణకని శరీరం భయానికి వణికింది.

తలుపు తీసేసరికి గప్పున అదోలాంటి వాసన. తడుముకుని లైటు వెలిగించి చూస్తే అలికిడిలేదు. మూసిన కిటికీరెక్కల్లోంచి కారిన నీటికి నేల సగం తడిసింది.

పట్టెమంచంమీద పెట్టెల సందుల్లో: మాసిన బట్టలమధ్య ఎక్కడ వెదికినా కన్పించలేదు పిల్లి

హమ్మయ్య! పిల్లినింట్లో వదలలేదు. పిల్లి చచ్చిపోనూలేదు. ప్రాణం కుదుట పడింది. హైకోర్టు ఓడిపోయి సుప్రీంకోర్టులో కేసు గెల్చుకున్నట్టయింది

ఆ మర్నాడు పక్కింటావిడవల్ల తెలిసింది. ఆ పిల్లి నాలుగైదు రోజులు యింటిచుట్టూ తిరిగిందనీ, వారం రోజుల నుంచి దానిజాడే తెలియదనీ—

మూడోరోజుకాక, నాలుగోరోజు "ఇదిగో ఒక్కసారిలా తొందరగారండి" దేవి పిలిస్తే వెళ్ళి చూస్తే యింకేముంది?

రాజాగాడితో ఆడుకుంటూ గంతులేస్తూ వాడికాళ్ళ మధ్యగాదూరితోకతో వాడిని రాస్తూ—పిల్లి!!

"వాడి ముఖం చూడండీ...ఎంత విప్పారిందో – యిన్నాళ్లూ వాడికి ఆటేలేదు. దాన్ని చూడగానే ఎక్కడలేని సరదా"

దేవి చెబుతోంది.

మళ్ళీ దాపురించింది—పిల్లి బ్రహ్మ హత్య!!!

( 1973 జూలై జ్యోతి )